క్లుప్తంగా

మీరావలికి సన్మానం



తెనాలిఅర్బన్: నందమూరి తారకరామారావు శత జయంత్యుత్సవాల్లో భాగంగా పెమ్మసాని థియేటర్‌లో గురువారం వీరకంకణం చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. శుక్రవారం భాగ్యరేఖ చిత్రాన్ని ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం కీబోర్డు ప్లేయర్, గిటారు విద్వాంసులు షేక్ మీరావలిని సన్మానించారు. కార్యక్రమంలో జె.మురళీకృష్ణ, ఇన్నమూరి వెంకటేశ్వర్లు, మునగా నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు



తెనాలిఅర్బన్: మారీసుపేట ఎన్‌సీఆర్ స్కూల్ నుంచి రేపల్లె గేటు వరకు ఉన్న ఆక్రమణలను మున్సిపల్ అధికారులు గురువారం తొలగించారు. జేసీబీతో మురుగు కాల్వల నిర్మాణానికి అవరోధంగా ఉన్న అన్నింటినీ తొలగించారు. తొలగింపు ప్రక్రియను ఏఈ రాజు, టౌన్ ప్లానింగ్ అధికారులు పర్యవేక్షించారు.

వంటగ్యాస్ ధర పెంపు తగదు



తెనాలి: కేంద్రంలో నరేంద్రమోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం ఈశాన్య రాష్ట్రాల ఎన్నికలైన వెంటనే వంట గ్యాస్ ధర పెంచి ప్రజలపై భారం మోపటం దారుణమని సీపీఎం తెనాలి కార్యదర్శి కొల్లిపర బాబూప్రసాద్, సీనియర్ నేత ములకా శివసాంబిరెడ్డి విమర్శించారు. వంట గ్యాస్ ధర పెంపును వ్యతిరేకిస్తూ గురువారం రూరల్ మండల గ్రామం జగ్గడిగుంటపాలెం, పట్టణ చెంచుపేటలోని రావి అమ్మయ్యచౌక్ వద్ద మహిళలు, రైతులతో కలిసి నిరసన తెలిపారు. కార్యక్రమాల్లో సీపీఎం నాయకులు షేక్ హుస్సేన్‌వలి, పి.జోసేష్, కె.రవికుమార్, ఎస్.రాజ్యలక్ష్మి, తాటి వెంకటేశ్వర్లు, రెడ్డి వీరమ్మ, నర్రా సత్యమ్మ, మైలా విజయలక్ష్మి, తాడిబోయిన వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఏఆర్‌టీ సెంటర్‌లో మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం



తెనాలిఅర్బన్: ఆగాపే లవ్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు దేవా, మైఖేల్ పుట్టిన రోజులను పురస్కరించుకుని వారి సహకారంతో జిల్లా వైద్యశాలలోని ఏఆర్‌టీ సెంటర్‌లో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను గురువారం మెడికల్ ఆఫీసర్స్ డాక్టర్ రమ్యకృష్ణ, డాక్టర్ స్నేహశ్రీ ప్రారంభించారు. ట్రస్ట్ అధ్యక్షుడు పి.రవికుమార్ మాట్లాడుతూ నిత్యం ఏఆర్‌టీ సెంటర్‌కు హెచ్ఐవీ బాధితులు 100 మందికిపైగా వస్తారని వివరించారు. వారి దాహార్తి తీర్చేందుకు దీనిని ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఏఆర్‌టీ కౌన్సిలర్లు ప్రేమజ్యోతి, రాణి పాల్గొన్నారు.

175 కాకపోతే 500 స్థానాల్లో పోటీ చేయండి

జనసేన పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్

తెనాలి: ప్రతిపక్షాల అజెండా గురించి ఆలోచించటం మానేసి ముఖ్యమంత్రి తన పని చూసుకోవాలని జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. అధికారపార్టీ 175 కాకపోతే 500 స్థానాల్లో పోటీచేసుకోవచ్చని, ఓపిక ఉంటే పక్క రాష్ట్రాల్లోనూ పోటీకి దిగొచ్చని చెప్పారు. గుంటూరు జిల్లా తెనాలిలోని తన నివాసంలో గురువారం నాదెండ్ల విలేకరులతో మాట్లాడారు. సీఎంపైనా, అధికారపార్టీపైనా విమర్శలు గుప్పించారు. నాదెండ్ల వెంట జనసేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బండారు రవికాంత్, పార్టీ నేతలు ఇస్మాయిల్ బేగ్ ఉన్నారు.

జనఔషధి వారోత్సవాల ర్యాలీ

మంగళగిరి: నగర పరిధిలోని నిర్మల ఫార్మసీ కళాశాల నోబెల్ క్లబ్ ఆధ్వర్యంలో జాతీయ సేవా పథకం వలంటీర్లు గురువారం జన ఔషధి వారోత్సవాల ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీ నగరంలోని నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద నుంచి నృసింహుని దేవస్థానం మీదుగా మిద్దె సెంటర్ వరకూ కొనసాగింది. ఈ సందర్భంగా డిప్లొమా ఫార్మసీ విద్యార్థులు జన ఔషధి మందులను వాడుదాం... అంటూ ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు.

మొక్కవోని జొన్న సాగు

- కర్షకుల మక్కువ
- విస్తారంగా సాగు
- ఎకరానికి 40 క్వింటాళ్ల దిగుబడి
- ధర క్వింటాకు రూ.2వేలు పైమాటే



కొల్లిపర మండలంలో సాగైన మొక్కజొన్న

తెనాలి డివిజన్‌లో సాగు ఇలా (ఎకరాల్లో)..		
గత ఏడాది రబీలో	:	23,000
ప్రస్తుతం	:	26,000

కొల్లిపర: ప్రధాన పంటల్లో మొక్కజొన్నది మూడో స్థానం. ఈ పంటలో పోషక విలువలు అధికంగా ఉండడంతో మార్కెట్‌లోనూ మంచి డిమాండ్ ఉంది. ప్రభుత్వ ప్రోత్సాహం ఉండడమే కాక ఆర్బీకేల ద్వారా మద్దతు ధరకు పంటను కొనుగోలు చేయడం వల్ల రైతులు ఎక్కువ మంది మొక్కజొన్న సాగుకు ఆసక్తి కనబరుస్తున్నారు. మాగాణి, మెట్ట భూముల్లోనూ ఈ పంట సాగుకు అనుకూలం. తెనాలి డివిజన్‌లో కొల్లిపర, తెనాలి, దుగ్గిరాల మండలాల్లో గతేడాది రబీలో 23,000 ఎకరాల్లో రైతులు మొక్కజొన్న సాగు చేశారు. ఈ ఏడాది విస్తీర్ణం 26,000 ఎకరాలకు చేరింది. దీనిని ఆహార పంటగానే కాకుండా దాణా, పశుగ్రాసం, వివిధ పరిశ్రమల్లో ముడి సరుకుగా ఉపయోగిస్తారు. వ్యవసాయ అధికారులు ఎప్పటికప్పుడు ఈ పంటపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. సాగులో మెలకువలు చెబుతున్నారు.

కొల్లిపర మండలంలో విస్తారంగా..

మొక్కజొన్న పంటను తెనాలి, దుగ్గిరాలతోపాటు కొల్లిపర మండలంలోని మెట్ట, మాగాణి రైతులు విస్తారంగా సాగు చేస్తున్నారు. కొల్లిపర మండలంలోని కొల్లిపర, వల్లభాపురం, మున్నంగి, అత్తోట, చక్రాయపాలెం, తూములూరు లంక గ్రామాల్లో ఎక్కువగా సాగవుతోంది. గత ఏడాది ఈ మండలంలో 3,500 ఎకరాల్లో సాగు చేయగా ఈ ఏడాది 5,780 ఎకరాలకు సాగు విస్తీర్ణం చేరింది. ప్రస్తుత పరిస్థితిని బట్టి దిగుబడి బాగా వచ్చే అవకాశం కనిపిస్తోంది. మార్చి నెలఖారులోగా దిగుబడులు వచ్చే ఆస్కారం ఉంది.

దిగుబడి, గిట్టుబాటు ఆశాజనకం

పంట మార్పిడి పద్ధతిలో మొక్కజొన్న పంట సాగు చేస్తుండటంతో దిగుబడులు ఆశాజనకంగా ఉంటున్నాయి. సరాసరిన ఎకరానికి 40–45 క్వింటాళ్ల దిగుబడి వస్తోంది. మొక్కజొన్నకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర క్వింటాలుకు రూ.1,962. బయట మార్కెట్‌లో క్వింటాలు రూ.2,250 వరకు పలుకుతోంది. డిమాండ్ అధికంగా ఉండడంతో వ్యాపారులు పొలాల వద్దే పంటను కొనుగోలు చేస్తున్నారు.



మంచి ధర ఉంది

నియోజకవర్గంలో మొక్క జొన్న సాగువైపు రైతులు మొగ్గు చూపుతున్నారు. గత ఏడాది రబీలో సుమారు 23,000 ఎకరాల్లో సాగు చేస్తే ఈ ఏడాది సుమారు 26,000 ఎకరాల్లో పంట సాగైంది. మార్కెట్లో మంచి ధర ఉంది. ప్రభుత్వం ఆర్బీకేల ద్వారానూ మద్దతు ధరకు కొనుగోలు చేస్తుంది.

– కె.వెంకటరావు, ఏడీఏ, తెనాలి



మొక్కజొన్నతో మేలు

ప్రభుత్వ మద్దతు ధర ప్రకటించడంతో మార్కెట్లోనూ ధర పెరిగింది. సర్కారు నిర్ణయం వల్ల రైతులకు కలిసొచ్చింది. మాగాణిలో వరి పంట అనంతరం మొక్కజొన్న సాగు మేలు చేస్తోంది. ఎకరాకు రూ.25 వేల పెట్టుబడి పెడితే 40 క్వింటాళ్లకు పైబడి దిగుబడి వస్తుంది. మంచి ధర వస్తే ఖర్చులు పోను రూ.50 వేల వరకు మిగులు ఉంటుంది.

– అవుతు శివారెడ్డి, మొక్కజొన్న రైతు



మూడు ఎకారల్లో సాగు చేశా

మొక్కజొన్నకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. పెట్టుబడి ఖర్చు తక్కువ. ఎకరాకు 40–45 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తోంది. మూడు ఎకరాల్లో మొక్కజొన్న, రెండు ఎకరాల్లో జొన్న సాగు చేశా. ప్రభుత్వ ప్రోత్సాహం రైతులకు మేలు చేస్తోంది.

–జొన్నల చంద్రశేఖరరెడ్డి, రైతు

రైల్వేగేటును పరిశీలించిన సబ్‌కలెక్టర్



రైల్వేగేటు వద్ద అధికారులు, రైతులతో గీతాంజలి శర్మ

తెనాలి: తెనాలి–రేపల్లె రైలు మార్గంలో చినరావూరు–జంపని మధ్య గల ఎస్‌సీ నంబర్ 257 గేటును తెనాలి సబ్‌కలెక్టర్ గీతాంజలి శర్మ వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో కలిసి గురువారం పరిశీలించారు. రైల్వే గేటును తెరిపించి రైతులకు వ్యయ ప్రయాసలు తగ్గించాలని కోరుతూ రైతు సంఘం గత నెల 23న ధర్నా చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రైల్వే గేటును పరిశీలించిన గీతాంజలి శర్మతో రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి మాట్లాడారు. నాబార్డు నిధులు రూ.3.70 కోట్లతో నిర్మించిన రహదారి మధ్యలోని గేటును రైల్వేశాఖ మూసివేయటం అన్యాయమని చెప్పారు. నాలుగు మండలాలు, ఎనిమిది గ్రామాల రైతాంగానికి ఉపయోగపడే 257 నంబరు గేటును మూసివేసి, రైతులకు ఉపయోగం లేని 258 నంబరు గేటుకు కాపలాదారుని పెట్టటంలో గల ఔచిత్యాన్ని గమనించాలని రైతులు విజ్ఞప్తి చేశారు. తహసీల్దారు కె.రవిబాబు, ఇరిగేషన్ డీఈఈ ప్రసాదరావు, రైల్వే, ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ తదితర శాఖల అధికారులు, జగ్గడిగుంటపాలెం, యడవూరు, జంపని, చినరావూరు రైతులు పాల్గొన్నారు.

రిచిగాడి పెళ్లి చిత్రయూనిట్ ఉండవల్లి రాక



హీరో మారిశెట్టి కిషోర్

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని ఉండవల్లికి చెందిన యువ హీరో కిషోర్ మారిశెట్టి ప్రధాన పాత్రలో నటించిన చలనచిత్రం రిచిగాడి పెళ్లి ఉండవల్లి సెంటర్‌లో నేడు విడుదల కానున్న సందర్భంగా గురువారం తాడేపల్లి ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హీరో కిషోర్ మాట్లాడుతూ తాను నటించి, నిర్మించిన చలనచిత్రం రాణి ఆహా ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో రిలీజ్ అయ్యి ట్రెండింగ్‌లో దూసుకు పోవడం తనకు సంతోషంగా ఉందని అన్నారు. అదేవిధంగా కేఎస్ ఫిల్మ్ వర్క్స్ పతాకంపై కేఎస్ హేమరాజ్ దర్శకత్వంలో నవీన్‌నేని, సత్య, ఎస్‌కె ప్రణీత పట్నాయక్, తదితరులతో కలిసి నటించిన ఫీల్ గుడ్ ఎమోషనల్ డ్రామా రిచిగాడి పెళ్లి ట్రైలర్ ఇప్పటికే ప్రేక్షకుల్ని ఆకట్టుకుందని చెప్పారు.

ఆర్యవైశ్యులకు రాజకీయంగా ప్రత్యేక గుర్తింపు



జవ్వాజి శ్రీనివాసరావును సత్కరించిన ఆర్యవైశ్య నేతలు

తెనాలి: రాజకీయ రంగంలో యువతను ప్రోత్సహిస్తూ ఆర్యవైశ్యుల అభ్యున్నతికి, రాజకీయ ప్రగతికి తోడ్పడుతున్న వైఎస్సార్ సీపీకి అండగా ఉంటామని ఆర్యవైశ్య సంఘం, అనుబంధ సంఘాల నాయకులు చెప్పారు. వైఎస్సార్ సీపీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడిగా తెనాలికి చెందిన జవ్వాజి శ్రీనివాసరావు నియమితులైన సందర్భంగా గురువారం స్థానిక శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థాన ప్రాంగణంలో అభినందన సమావేశం నిర్వహించారు. పట్టణంలో తొలినుంచీ వైఎస్సార్ సీపీ తరఫున ఆర్యవైశ్యులకు ప్రత్యేక గుర్తింపును ఇస్తున్నారని చెప్పారు. ఇందుకు కారకులైన ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ వాణిజ్య విభాగం అధ్యక్షుడిగా వ్యాపారులకు అందుబాటులో ఉంటానని, ఏ సమస్య వచ్చినా పరస్పరం చర్చించుకుని పరిష్కరించుకుందామని జవ్వాజి శ్రీనివాసరావు చెప్పారు. అనంతరం శ్రీనివాసరావును సత్కరించారు. పట్టణానికి చెందిన ప్రముఖులు, ఆర్యవైశ్య సంఘం, అనుబంధ సంఘాల నేతలు దేసు శ్రీనివాసరావు, వుప్పల వరదరాజులు, భాస్కరుని శ్రీనివాసరావు, కొల్లా గురునాథగుప్తా, చుండూరు సాయి, గుండా కోటేశ్వరావు, మాలేపాటి వేణు, అచ్యుత సాంబశివరావు, వెచ్చా నాగరాజారావు, నంబూరి బ్రహ్మం, కాకరపర్తి సుబ్రహ్మణ్యం, ఆత్మకూరి పూర్ణచంద్రరావు, శ్రీనివాసరావు గుప్తా, కృష్ణకిశోర్, కృష్ణప్రసాద్, తూనుగుంట్ల సుబ్బారావు పాల్గొన్నారు.

రైల్వే చార్జీలను తగ్గించాలి



వినతిపత్రం అందజేస్తున్న సంఘ నాయకులు

తెనాలి: కరోనా విపత్కర పరిస్థితుల్లో రైల్వేశాఖ పెంచిన ఎక్స్‌ప్రెస్, రిజర్వేషన్ చార్జీలను వెంటనే తగ్గించాలని, ప్యాసింజర్ రైళ్ల సంఖ్యను పెంచాలని, సీనియర్ సిటిజన్లకు చార్జీల రాయితీలను పునరుద్ధరించాలని ది తెనాలి పట్టణ, పరిసర ప్రాంత అభివృద్ధి సంఘం విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు వినతిపత్రాన్ని సంఘ నాయకులు గురువారం స్థానిక రైల్వే స్టేషన్ సూపరింటెండెంట్‌కు అందజేశారు. కరోనా లాక్‌డౌన్ తర్వాత రైలు ప్రయాణాలను పునరుద్ధరించిన రైల్వేశాఖ, ప్యాసింజర్ల స్థానంలో ఎక్స్‌ప్రెస్, స్పెషల్ అంటూ పేర్లు పెట్టి కనీస చార్జీని రూ.10ని రూ.30 చేసినట్టు సంఘ నాయకులు గుర్తుచేశారు. ఎక్స్‌ప్రెస్ చార్జీలు, రిజర్వేషను చార్జీలనూ బాగా పెంచినట్టు వివరించారు. సాధారణ పరిస్థితులు నెలకొన్నాక చార్జీలను తగ్గించలేదనీ, స్పెషల్ అనే పదాన్ని తొలగించ లేదని సంఘం అధ్యక్షుడు దరిశి శివకోటేశ్వరరావు వివరించారు. ఇప్పటికైనా చార్జీలు తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి బొమ్మదేవర వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు రావూరి శివశంకరరావు, కోశాధికారి ఆరాయణం కమల్‌కుమార్, మాచిరాజు కృష్ణమూర్తి, సోమారెడ్డి, సోమయ్యశాస్త్రి, వాకా పేరిరెడ్డి, ఆరీఫ్, అశోక్ పాల్గొన్నారు.

ఆ ఇద్దరూ మహోన్నతులు

కె.విశ్వనాథ్, జీజీ కృష్ణారావు సంతాప సభలో వక్తలు



నివాళులర్పిస్తున్న సాయిలక్కరాజు, ఇతర వక్తలు

తెనాలి: ప్రముఖ సినీ దర్శకుడు కె.విశ్వనాథ్, సినీ ఎడిటర్ జీజీ కృష్ణారావు సంతాప సభను గురువారం సాయంత్రం స్థానిక పెన్షనర్స్ అసోసియేషన్ హాలులో నిర్వహించారు. స్థానిక స్వరలయ వేదిక సంస్థ ఆధ్వర్యంలో జరిగిన సభలో తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను తన సినిమాలతో పదిలపరిచి, దేశవిదేశాల్లో చాటిన మహోన్నత దర్శకుడు కె.విశ్వనాథ్ అని వక్తలు తమ ప్రసంగాల్లో పేర్కొన్నారు. దృశ్యకావ్యం అనదగ్గ శంకరాభరణం సినిమాకు దర్శకుడు కె.విశ్వనాథ్ ఫిబ్రవరి 2న, అదే సినిమాకు ఎడిటర్ అయిన జీజీ కృష్ణారావు అదే నెల 21న మృతిచెందారని స్వరలయ వ్యవస్థాపకుడు సాయి లక్కరాజు గుర్తుచేశారు. ఇద్దరూ మహోన్నతులని పేర్కొన్నారు. స్వరలయ సంస్థ ప్రదానం చేసే ఉగాది పురస్కారాల్లో ఇక నుంచీ ఉత్తమ ఎడిటర్ అవార్డును, నగదు పారితోషికాన్ని అందిస్తామని ప్రకటించారు. పొన్నపల్లి గోపాలకృష్ణ, డీవీ సోమయ్యశాస్త్రి, బొమ్మదేవర వెంకటేశ్వరరావు మాట్లాడారు. తొలుత విశ్వనాథ్, కృష్ణారావు చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించారు.

కేఎల్‌యూలో మహిళా మహోత్సవం

హాజరైన ప్రముఖులు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న గీత, వాసవి, జగన్నాథరావు

తాడేపల్లిరూరల్: స్థానిక వడ్డేశ్వరం కె.ఎల్.విశ్వవిద్యాలయంలో మహిళా మహోత్సవ కార్యక్రమాలు గురువారం ఆరంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ యువజన సర్వీసుల శాఖ ముఖ్య కార్యదర్శి వాణీ మోహన్, డీఐజీ రాజకుమారి, మీడియా మింట్ హైదరాబాద్ డి.గీతా, సీఈవో పల్లవి, హైదరాబాద్ ట్రిపుల్‌ఈ హరి వైదగ్ని, విజయవాడ దిశ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వాసవి, మిసెస్ ఆంధ్రా పి. చంద్రికలు విచ్చేశారు. ఈ సందర్భంగా యువజన సర్వీసుల శాఖ ముఖ్య కార్యదర్శి వాణిమోహన్ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని అంతర్జాతీయ మహిళా దినోత్సవం అనేది మహిళల సామాజిక, ఆర్థిక, రాజకీయ విజయాలను గుర్తు చేసేదిగా ఉండాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ మహిళలకు ప్రత్యేక స్థానం కల్పించిందన్నారు. దేశంలోనే తొలిసారిగా మన రాష్ట్రంలో దిశ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేయడం చారిత్రకమన్నారు. డి.గీత మాట్లాడుతూ గ్రామీణ మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి అంతర్జాతీయ స్థాయిలో చర్చ జరగాలన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం ప్రొ చాన్సలర్ డాక్టర్ కె.ఎస్.జగన్నాధరావు, వైస్ చాన్సలర్ డాక్టర్ జి. పార్థసారధి వర్మ, ప్రొ వీసీ డాక్టర్ ఎన్.వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎ.జగదీష్, విద్యార్థి వ్యవహారాల డీన్ డాక్టర్ చప్పిడి హనుమంతరావు, ఫెమ్ ఫ్లేర్ కన్వీనర్లు డాక్టర్ హేమదివ్య, డాక్టర్ రూతు రమ్య, డాక్టర్ హేమమాలిని, డాక్టర్ పద్మావతి, డాక్టర్ శ్రీకావ్య, సాహితి పాల్గొన్నారు.

శభాష్.. సాదియా ఆల్మస్



ఆల్మస్‌ను అభినందిస్తున్న గుమ్మడి పుల్లేశ్వర రావు, కోచ్ ఎస్‌కే సంధానీ

మంగళగిరి: జమ్మూ కాశ్మీర్‌లో గత నెల 23 నుండి 27వ తేదీ వరకు జమ్మూ పవర్ లిఫ్టింగ్ ఫెడరేషన్ కప్ ఇండియా పోటీల్లో పట్టణానికి చెందిన అంతర్జాతీయ పవర్ లిఫ్టర్ సాదియా ఆల్మస్ అత్యంత ప్రతిభను చాటినట్లు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి గుమ్మడి పుల్లేశ్వరరావు తెలిపారు. నగరంలోని జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆయన వివరాలను వెల్లడించారు. జమ్మూ పవర్ లిఫ్టింగ్ ఫెడరేషన్ కప్ ఇండియా పోటీల్లో సాదియా ఆల్మస్ 57 కేజీల మహిళా విభాగంలో రాష్ట్రం తరఫున పోటీ చేసి రెండు గోల్డ్ మెడల్స్, ఒక సిల్వర్ మెడల్ సాధించినట్లు తెలిపారు. స్క్వాట్ 195 కేజీల బరువునెత్తి గోల్డ్ మెడల్ జూనియర్ నేషనల్ రికార్డు, బెంచి ప్రెస్ 77.5, డెడ్ లిఫ్ట్ 182.5 కేజీల బరువునెత్తి గోల్డ్ మెడల్ జూనియర్ నేషనల్ రికార్డు సాధించినట్లు పుల్లేశ్వరరావు తెలిపారు. పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ సాధించిన సాదియా ఆల్మస్‌కు కోచ్ ఎస్‌కే సంధానీ అభినందనలు తెలిపారు.

ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతాం



గండాలయ స్వామికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు



ఆత్మకూరులో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి

గండాలయ స్వామి కొండ అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు

మంగళగిరి: ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా మంగళగిరి–తాడేపల్లి నగరాన్ని తీర్చిదిద్దనున్నట్లు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) తెలిపారు. గురువారం ఉదయం ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావుతో కలిసి కొండపై దాతల సహకారంతో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. అన్నప్రసాద భవనంలో చేయాల్సిన ఏర్పాట్లు, వసతి గృహ నిర్మాణం తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ గండాలయ స్వామి కొండపై అన్నివసతులు సమకూరిస్తే భక్తులతో పాటు సందర్శకులు కొండకు తరలివస్తారన్నారు. కొండపై నుంచి నగరం మొత్తం ఎంతో అందంగా కన్పిస్తుందన్నారు. గండాలయ స్వామి కొండ అభివృద్ధికి దాత దేవతి భగవన్నారాయణ ముందుకు వచ్చినట్లుగానే మరింతమంది దాతలు ముందుకు రావాలన్నారు. మరో వైపు లక్ష్మీనృసింహస్వామి కొండపై అటవీశాఖ ఆధ్వర్యంలో ట్రెక్కింగ్ ట్రాక్ నిర్మాణం, టెంపుల్ హిల్ ఏకో పార్కుల నిర్మాణంతో ఉదయం సాయంత్రం వేలల్లో వేలాది మంది తరలివచ్చి వాకింగ్ చేసుకోవడంతో పాటు ఓపెన్ జిమ్‌లో వ్యాయామం చేసుకుంటూ ఆరోగ్యంతో పాటు ఆహ్లాదాన్ని పొందుతున్నారన్నారు. ఆలయ ఈఓ ఎ.రామకోటిరెడ్డి, పార్టీ జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

ఆత్మకూరులో అభివృద్ధి పనుల పరిశీలన...

ఆత్మకూరు (మంగళగిరి): నాణ్యత లోపం లేకుండా అభివృద్ధి పనులు వేగవంతం చేసి పూర్తి చేయాలని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) అధికారులకు సూచించారు. గురువారం నగర పరిధిలోని ఆత్మకూరులో విస్తృతంగా పర్యటించి అభివృద్ధి పనులను పరిశీలించారు. తొలుత సచివాలయం వద్ద గల అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సచివాలయం వద్ద నుంచి తెనాలి రోడ్డు వరకు జరుగుతున్న సీసీ డ్రెయిన్ పనులను, రోడ్డు విస్తరణ పనులను పరిశీలించారు. అనంతరం గుంటూరు చానల్ వద్ద తాగునీటి పథకం ఆవరణలో జరుగుతున్న వాటర్ సంపు నిర్మాణం, స్విమ్మింగ్ పూల్, స్కేటింగ్ రింగ్ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోట్లాది రూపాయలతో జరుగుతున్న అభివృద్ధి పనులల్లో నాణ్యతా ప్రమాణాలు లోపించకుండా త్వరితగతిన నిర్మాణ పనులను పూర్తి చేయాలన్నారు. తెనాలి రోడ్డు నుంచి మంగళగిరి వైపు వచ్చే వాహనాలు రోడ్డు విస్తరణతో ఆత్మకూరు మీదుగా జాతీయ రహదారికి వెళ్లవచ్చునన్నారు. నిర్మల కళాశాల నుంచి తెనాలి రోడ్డు వరకు సెంట్రల్ లైటింగ్‌తో నాలుగు లైన్ల రోడ్డు అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. ఇప్పటికే నిర్మలా కళాశాల నుంచి ఆత్మకూరు సచివాలయం వరకు సెంట్రల్ లైటింగ్‌తో నాలుగు లైన్ల రోడ్డు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చామని, త్వరలోనే సచివాలయం నుంచి తెనాలి రోడ్డు వరకు నాలుగు లైన్ల రోడ్డు అభివృద్ధి పనులు పూర్తి చేస్తామన్నారు. జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, మాజీ సర్పంచి, సీనియర్ నాయకుడు బొమ్ము శివరామిరెడ్డి, జిల్లా కార్యదర్శి మల్లవరపు సుధారాణి, నగరపాలక సంస్థ అధికారులు కృష్ణారెడ్డి, కిషోర్ పాల్గొన్నారు.

హైకోర్టు న్యాయమూర్తిని కలసిన బార్ ప్రతినిధులు



హైకోర్టు జడ్జి జస్టిస్ డీవీఎస్ సోమయాజులును కలిసిన మంగళగిరి బార్ అసోసియేషన్ ప్రతినిధులు

మంగళగిరి: మంగళగిరిలో నూతనంగా ఏర్పాటు చేయనున్న అదనపు జిల్లా కోర్టుతో పాటు ప్రస్తుత కోర్టు భవనాల మరమ్మతుల విషయంలో సహకరించాల్సిందిగా హైకోర్టు న్యాయమూర్తి, గుంటూరు జిల్లా ఫోర్ట్ ఫోలియో జడ్జి జస్టిస్ డీవీఎస్ సోమయాజులును బార్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. గురువారం మంగళగిరి బార్ అసోసియేషన్ ప్రతినిధులు హైకోర్టు న్యాయమూర్తి డీవీఎస్ సోమయాజులును మర్యాదపూర్వకంగా కలిసి తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. హైకోర్టు జడ్జి డీవీఎస్ సోమయాజులును కలిసిన వారిలో మంగళగిరి బార్ అసోసియేషన్ అధ్యక్షులు దొడ్డక బ్రహ్మానందరావు, ప్రధాన కార్యదర్శి తోట నరసింహారావు, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ రేటూరి కిషోర్, ఉపాధ్యక్షుడు జొన్నాదుల లెనిన్ బాబు, సూరబోయిన మురళీకృష్ణ ఉన్నారు.

మత్తులో విద్యార్థుల భవిష్యత్తు చిత్తు

మంగళగిరి: మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల వల్ల విద్యార్థుల జీవితాలు నిలువులా నాశనమవుతాయని మంగళగిరి రూరల్ ఎస్ఐ టి.రమేష్ బాబు అన్నారు. గురువారం మంగళగిరి రూరల్‌పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో మహిళా పోలీసులకు మాదక ద్రవ్యాలు, సోషల్ మీడియా దుర్వినియోగంపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎస్ఐ టి.రమేష్‌బాబు మాట్లాడుతూ సరదాగా అలవాటు చేసుకుని, చివరికి మత్తు పదార్థాలు లేకుంటే ఉండలేని స్థితికి వస్తారని, మత్తు మైకంలో చదువుకు దూరమవుతూ విలువైన జీవితాన్ని నిర్వీర్యం చేసుకుంటున్నారన్నారు. నవజీవన్ బాల భవన్ క్లినికల్ సైకాలజిస్టు డాక్టర్ షీలా నికోలస్ మాట్లాడుతూ సచివాలయ మహిళా పోలీసులు మాదక ద్రవ్యాల వినియోగంపై వాటి వల్ల కలిగే నష్టాలను ప్రజలకు వివరించాలన్నారు. సైకాలజిస్టు జి.అనూష మాట్లాడుతూ కుటుంబ సభ్యులు, స్నేహితులతో అత్యధిక సమయం గడిపితే ఒంటరితనాన్ని జయించవచ్చన్నారు.